నమస్తే తెలంగాణ
నిర్మల్
5 | నిజామాబాద్, మంగళవారం 9 జనవరి 2024 | NIRMAL

ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని వినాయక్ చౌక్ వద్ద టోకెన్లు ఇవ్వకపోవడంతో రాస్తారోకో చేస్తున్న పట్టణ వాసులు

ఆధార్ టోకెన్ల కోసం ఆందోళన

ఆదిలాబాద్ రూరల్, జనవరి 8 : ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా ఈకేవైసీ కష్టాలు ఆగడం లేదు. ఆధార్ సెంటర్స్ వద్ద టోకెన్ల కోసం ప్రజలు బారులుదీరుతున్నారు. ఇందులో భాగంగా ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయంలోని సెంటర్ వద్ద సోమవారం వేకువజామున నుంచే ప్రజలు భారీగా చేరుకున్నారు. టోకెన్లు అందకపోవడంతో స్థానిక వినాయక చౌక్ వద్ద ప్రజలు రాస్తారోకో చేపట్టారు. దీంతో రాకపోకలు నిలిచాయి. గంటల తరబడి నిరీక్షిస్తున్న టోకెన్లు ఇవ్వడం లేదని ప్రజలు వాపోతున్నారు.

ఒకరికి జీవితఖైదు

నిర్మల్ అర్బన్, జనవరి 8 : పాత పగలను మనసులో పెట్టుకొని గొడ్డలితో నరికి చంపిన కేసులో ఒకరికి జీవితఖైదు విధిస్తూ సోమవారం లైజర్ అధికారి సక్రియా నాయక్ తీర్పు వెలువరించారు. వివరాలిలా ఉన్నాయి. నిర్మల్ జిల్లా పెంబి మండలంలోని కొలాంగూడ పసుపుల గ్రామానికి చెందిన టేకం తుకారాం, చీకటి చిన్న గంగారాంలు నిత్యం మద్యం తాగేవారు. ఈ క్రమంలో మూడు, నాలుగు సార్లు గొడవ పడ్డారు. తుకారాం గొడవలను మనసులో పెట్టుకొని గంగారాంను చంపాలని నిర్ణయించుకున్నాడు. డిసెంబర్ 15, 2018 రోజున గంగారాం పంట చేనుకు ఒంటిరిగా వెళ్లడాన్ని తుకారాం గమనించాడు. గ్రామ శివారులోని చిలుకల చిన్నమ్మ గుడి వద్ద కాపుకాసి గొడ్డలితో నరికి చంపాడు. గంగారాం కుమారుడు రవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం పీపీ కల్వకుంట్ల వినోద్‌రావు 13 మంది సాక్షులను ప్రవేశపెట్టారు. కోర్టులో నేరం రుజువు కావడంతో నిర్మల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్ నిందితుడు టేకం తుకారాంకు జీవితకాలం కఠిన కారాగార శిక్ష, రూ.2వేల జరిమానా విధించాడు.

ఇథనాల్ ఫ్యాక్టరీని తరలించాలి..

- రైతుల పోరాటానికి బీఆర్ఎస్ అండగా ఉంటుంది..
- రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తి వేయాలి..
- ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి అనుచరులే భూమిపూజ చేశారు..
- కేంద్ర ప్రభుత్వమే అనుమతులు మంజూరు చేసింది..
- బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలే సమాధానం చెప్పాలి..
- మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన అనుమతి పత్రాలను చూపుతున్న మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్, జనవరి 8(నమస్తే తెలంగాణ) : నిర్మల్ జిల్లాలోని దిలావర్‌పూర్-గుండంపెల్లి గ్రామాల మధ్య నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీని ఇక్కడి నుంచి తరలించాలని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీ ఏర్పాటును నిరసిస్తూ ఆయా గ్రామాల రైతులు చేస్తున్న ఆందోళనకు బీఆర్ఎస్ పార్టీ తరపున సంఘీభావం ప్రకటిస్తున్నామన్నారు. సోమవారం నిర్మల్‌లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై స్థానిక బీజేపీ, కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌పై బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అన్ని అనుమతులను ఇచ్చిందని, ఈ పాపం బీజేపీది కాగా, వాస్తవాలు తెలియని ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి బీఆర్ఎస్ వల్లనే ఫ్యాక్టరీకి అనుమతులు వచ్చాయని పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎలాంటి ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండానే పచ్చటి పంట పొలాల మధ్య ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందన్నారు. పరిశ్రమ ఏర్పాటుకు ముందు స్థానిక నాయకులు, రైతులతో కేంద్ర ప్రభుత్వ అధికారులు చర్చలు జరుపలేదన్నారు. గతేడాది ఫిబ్రవరి 24వ తేదీన కేంద్ర ప్రభుత్వంలోని అటవీ, పర్యావరణ, వాతావరణ శాఖ ప్రజల నుంచి ఎలాంటి అభ్యంతరాలను స్వీకరించకుండా నేరుగా అనుమతులు మంజూరు చేసిందని, ఇందుకు సంబంధించిన అనుమతి పత్రాలను మీడియాకు చూపించారు. కేంద్ర ప్రభుత్వ అనుమతుల తర్వాతే రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి గతేడాది జూన్ 23న కేవలం పర్యావరణ అనుమతులను మాత్రమే ఇచ్చిందని స్పష్టం చేశారు. ఇందులో బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రమేయం లేదని, అనుమతుల మంజూరు అంతా కేంద్రం పరిధిలోనే ఉంటుందన్నారు.

గతంలోనే రైతుల ఆందోళనకు మద్దతిచ్చాం..

దిలావర్‌పూర్ సమీపంలో ఇథనాల్ పరిశ్రమ రాబోతున్నదని తెలుసుకున్న రైతులు గతంలోనే ఆందోళనకు దిగారన్నారు. ఈ విషయం మా దృష్టికి రావడంతో వారి ఆందోళనకు మద్దతు తెలిపామని పేర్కొన్నారు. ఫ్యాక్టరీ ఏర్పాటును అడ్డుకుంటామని తాము అధికారంలో ఉన్నప్పుడే హామీ ఇచ్చామని గుర్తు చేశారు. దీంతో పరిశ్రమ నిర్మాణానికి ఏర్పాట్లు జరుగలేదన్నారు. ఇంతలోనే అసెంబ్లీ ఎన్నికలు రావడం, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ పనులు మొదలయ్యాయన్నారు. దీనికి అధికార కాంగ్రెస్ పార్టీ నేతలు, స్థానిక బీజేపీ ఎమ్మెల్యేనే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పరిశ్రమ ఏర్పాటు వెనుక ఎవరున్నారో రైతులందరికీ తెలుసన్నారు. మహేశ్వర్‌రెడ్డి ప్రధాన అనుచరులైన తక్కల రమణారెడ్డి, జంగం వీరేశం, సత్యం చంద్రకాంత్, ముత్యంరెడ్డి, ఏలేటి చిన్న నర్సారెడ్డితోపాటు మరికొందరు ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం కొబ్బరికాయ కొట్టి భూమిపూజ చేశారని తెలిపారు. నవంబర్ 29, 2022 న పీఎంకే డిస్టిలరీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి స్థానిక రైతుల భూములను సేల్‌డీడ్ ద్వారా ఇప్పించింది ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి అనుచరులేనని ఆరోపించారు. సదరు కంపెనీకి మహేశ్వర్‌రెడ్డి అనుచరులు భూములను ఇప్పించకపోతే ఇక్కడ ఫ్యాక్టరీ ఏర్పాటు అయ్యేదే కాదన్నారు. ఇథనాల్ ఫ్యాక్టరీ గుండంపెల్లిలో ఏర్పాటు చేయడానికి మహేశ్వర్‌రెడ్డి, ఆయన అనుచరులే అన్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. చేసిందంతా చేసి ఇప్పుడు మాపై బురద జల్లాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఇప్పటికైనా రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తేయాలని, లేకుంటే న్యాయ పోరాటం చేస్తామన్నారు. పరిశ్రమ ఏర్పాటు పనులను నిలిపి వేసి రైతులతో చర్చలు జరుపాలని కోరారు. పచ్చటి పంట పొలాల మధ్య నుంచి పరిశ్రమను తరలించే వరకు రైతులతో కలిసి పోరాడుతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, మాజీ డీసీసీబీ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అర్జీలను సత్వరం పరిష్కరించాలి..

అర్జీలను స్వీకరిస్తున్న నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిర్మల్ టౌన్, జనవరి 8 : ప్రజలు ఇచ్చిన అర్జీలను సత్వరం పరిష్కరించాలని నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఫైజన్ అహ్మద్‌తో కలిసి అర్జీలను స్వీకరించారు. వచ్చిన దరఖాస్తులను అధికారులు త్వరగా పరిష్కరించాలని సూచించారు. సోమవారం 37 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

దివ్యాంగ సంక్షేమ శాఖ, దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన డోర్ క్యాలెండర్‌ను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆవిష్కరించారు. దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం చేయూతనిస్తున్నదని సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. డీపీఆర్‌వో తిరుమల, డీఆర్‌డీఏ విజయలక్ష్మి, డీఆర్వో లోకేశ్ పాల్గొన్నారు.

ప్రగతికి మొండి'చేయి'

రూ.50 కోట్ల మంజూరును నిలిపేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

- ఆగిపోనున్న ఆదిలాబాద్ బల్దియా అభివృద్ధి
- కేసీఆర్ హయాంలో నిధులు మంజూరు

ఆదిలాబాద్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ ప్రేమేందర్

GOVERNMENT OF TELANGANA
ABSTRACT
Municipal Administration & Urban Development Department-Sanction of loan amount of Rs. 50.00 crore from TUFIDC to Adilabad Municipality for taking up developmental works- Permission Accorded-Orders issued.
MUNICIPAL ADMINISTRATION & URBAN DEVELOPMENT (UBS) DEPARTMENT
G.O.Ms.No. 719 Dated: 22.09.2023
Read the following:
1 G.O.Ms.No. 51 MA&UD (UBS) Dept., Dated 13.2.2018
2 From O.S.D. to M (MA&UD), Note No.85/OSD to MA&UD (E&C) (SC)/2023, Dated 16.9.2023
ORDER:
In the circumstances recited in the reference 2nd read above and after careful examination, Government hereby accords permission to TUFIDC to sanction of loan amount of Rs. 50.00 crore to Adilabad Municipality for taking up developmental works as per terms and conditions fixed by TUFIDC with the necessary approval and duly following all land owner procedure.
2 The Director, Approval, Dated shall submit initial proposals to TUFIDC and payments shall be released against the bills produced.
3 The Vice Chairman & Managing Director, TUFIDC, Hyderabad shall take necessary action accordingly in the matter.
(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF TELANGANA)
ARVIND KUMAR
SPECIAL CHIEF SECRETARY TO GOVERNMENT
To
The Vice Chairman & Managing Director, TUFIDC, Hyderabad
Copy to
The Commissioner & Director, Municipal Administration, Hyderabad
The Commissioner, Adilabad Municipality
The OSD to Hon'ble MA&UD

రూ. 50 కోట్లు మంజూరు చేస్తూ కేసీఆర్ సర్కారు ఇచ్చిన జీవో

ఆదిలాబాద్, జనవరి 8(నమస్తే తెలంగాణ) : ఉమ్మడి రాష్ట్రంలో ఆదిలాబాద్ మున్సిపాలిటీ అధ్వానంగా ఉండేది. సమైక్య పాలకుల నిర్లక్ష్యం వల్ల ప్రజలు కనీస సౌకర్యాలకు నోచుకోలేదు. పట్టణంలోని ప్రధాన వార్డులతో పాటు శివారు కాలనీల్లో పారిశుధ్యం పడకేసింది. చెత్తాచెదారం పేరుకుపోవడం, మురికి కాలువలు శుభ్రపర్చకపోవడంతో దుర్వాసన వచ్చేది. రోడ్లు సరిగా లేకపోవడం, తాగునీటి వసతి లేక ప్రజలు అవస్థలు పడేవారు. ఉమ్మడి రాష్ట్రంలో సమస్యలు పరిష్కరించాలని పాలకులను కోరినా ఫలితం కనిపించలేదు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆదిలాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టింది.

రూ.300 కోట్లతో అభివృద్ధి పనులు

ఆదిలాబాద్ మున్సిపాలిటీలో గతంలో 36 వార్డులు ఉండగా.. సరిహద్దు ప్రాంతాలను కలిపి వార్డుల సంఖ్య 49కి పెంచింది. పాత వార్డులతోపాటు కొత్త వార్డుల అభివృద్ధికి అధికారులు ప్రత్యేక ప్రణాళికలు తయారు చేశారు. పదేండ్ల కాలంలో రూ.300 కోట్లతో కేసీఆర్ ప్రభుత్వం పట్టణ ప్రగతిలో భాగంగా అభివృద్ధి పనులకు నిధులు కూడా కేటాయించింది. పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని కాలనీల్లో రహదారులు, మురికికాల్వల నిర్మాణం, ఇంటింటికీ నల్లానీటి సౌకర్యం కల్పించారు. వార్డుల్లో పార్కుల ఏర్పాటు, హరితహారంలో భాగంగా మొక్కల పెంపకం చేపట్టారు. రూ.50 కోట్లతో అన్ని చౌరస్తాలను అభివృద్ధి చేయడంతో కనువిందు చేస్తున్నాయి.

రూ.50 కోట్ల నిలిపివేత

మున్సిపాలిటీ పరిధిలో 36 వార్డులు ఉండగా.. పునర్ వ్యవస్థీకరణలో భాగంగా 49 వార్డులకు విస్తరించింది. పాత వార్డులతో పాటు కొత్తగా మున్సిపాలిటీలో ఏర్పడ్డ 13 వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది. ఇందుకోసం కేసీఆర్ ప్రభుత్వం రూ.50 కోట్లను మంజూరు చేసింది. తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీయూఎఫ్ఐడీసీ) నుంచి రుణంగా ఇస్తున్నట్లు గతేడాది సెప్టెంబర్ 22న జీవోఆర్‌టీ నంబర్ 719ను ప్రభుత్వం విడుదలు చేసింది. ఈ క్రమంలో ఎన్నికల కోడ్ రావడంతో పనులు ప్రారంభించలేదు. మున్సిపాలిటీలోని వివిధ వార్డులకు కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసిన రూ.50 కోట్లను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో కాలనీల్లో అభివృద్ధి పనులకు ఆటకం కలుగుతున్నది.

కలెక్టర్‌కు వినతిపత్రం

ఆదిలాబాద్ పట్టణాభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసిన రూ.50 కోట్లను విడుదల చేయాలంటూ మున్సిపల్ చైర్మన్‌తో పాటు పలువురు కౌన్సిలర్లు సోమవారం కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వార్డుల్లో ప్రజలకు సౌకర్యాల కల్పన కోసం మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న చొరవతో కేసీఆర్ ప్రభుత్వం రూ.50 కోట్లను మంజూరు చేసిందని నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతారని, మున్సిపాలిటీలోని వార్డుల అభివృద్ధి కోసం ప్రభుత్వం సహాయ, సహకారాలు అందించాలని సూచించారు. నిధులు విడుదల చేయకపోతే కౌన్సిల్ సభ్యులతో కలిసి ధర్నా చేస్తామన్నారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన వారిలో కౌన్సిలర్లు అకుల వెంకన్న, ఇమ్రాన్, భూమన్న, శ్రీనివాస్, మిష్ణు ఉన్నారు.

.. మరిన్ని జిల్లా వార్తలు 8లో

సీవోఈ పిలుస్తోంది

సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో ఇంటర్ ప్రవేశాలకు నోటిఫికేషన్

- రాష్ట్ర వ్యాప్తంగా 38 కాలేజీల్లో 3,680 సీట్లు ఖాళీ
- ఈ నెల 15వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ
- ఫిబ్రవరి 4న కామన్ ఎంట్రన్స్ టెస్ట్

బెల్లంపల్లి రూరల్, జనవరి 8 : నిరుపేద విద్యార్థులు గురుకులాల్లో చేరేందుకు సదావకాశం వచ్చింది. సంక్షేమ గురుకులాలకు వన్నె తెస్తున్న సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ(సీవోఈ) కళాశాలల్లో జూనియర్ ఇంటర్మీడియట్ ప్రవేశాలకు కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (టీఎస్‌డబ్ల్యూఆర్ సీవోఈ సెట్ 2024) నోటిఫికేషన్ వెలువడింది. ఇంగ్లిష్ మీడియంతోపాటు తెలుగు మీడియం చదువుకున్న నిరుపేద విద్యార్థులు కూడా ఈ కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌ను రాయవచ్చు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయి. ఎంపీసీ, బైపీసీ గ్రూపుల వారికి ఇంటర్మీడియట్ బోధనతోపాటుగా ఐఐటీ, నీట్ వంటి ప్రవేశ పరీక్షలకు సీవోఈల్లో ప్రత్యేకమైన శిక్షణ ఇస్తారు. ఆంగ్లంలో బోధన ఉంటుంది. సెకండ్ లాంగ్వేజ్ తెలుగు మాత్రమే ఉంటుంది. బాలబాలికలకు వేర్వేరుగా సీవోఈ కళాశాలలు ఉన్నాయి.

సీట్ల వివరాలు

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 38 సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ(సీవోఈ)లలో మొత్తం 3,680 సీట్లు అందుబాటులో ఉన్నాయి. బాలురకు 1,680 సీట్లు, బాలికలకు 2 వేల సీట్లు ఉన్నాయి. ఇందులో ఎస్సీ కేటగిరీకి 75 శాతం, ఎస్సీ కన్వర్టెడ్ క్రిస్టియన్లకు 2 శాతం, ఎస్టీలకు 6 శాతం, బీసీలకు 12 శాతం, మైనార్టీలకు 3 శాతం, జనరల్, ఈబీసీ అభ్యర్థులకు 2 శాతం చొప్పున సీట్లు కేటాయించారు.

బాలురకు..

రంగారెడ్డి జిల్లాలోని గౌలిదొడ్డిలో ఎంపీసీ, బైపీసీ గ్రూపులలో ఒక్కోదానిలో 120 చొప్పున మొత్తం 240 సీట్లు, ఇబ్రహీంపట్నంలో ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ఒక్కోదానిలో 40 చొప్పున మొత్తం 80 సీట్లు, సంగారెడ్డిలోని హత్నూరలో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ఒక్కదానిలో 80 చొప్పున మొత్తం 160 సీట్లు, మిగిలిన అన్ని కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ఒక్కోదానిలో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

బాలికలకు..

రంగారెడ్డి జిల్లాలోని గౌలిదొడ్డిలో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ఒక్కోదానిలో 160 చొప్పున మొత్తం 320 సీట్లు, ఖమ్మంలో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ఒక్కోదానిలో 80 చొప్పున మొత్తం 160 సీట్లు, కిస్టాపూర్, మేడ్చల్‌లో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ఒక్కోదానిలో 40 చొప్పున మొత్తం 80సీట్లతో పాటు మిగిలిన అన్ని కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ఒక్కోదానిలో 40సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో గౌలిదొడ్డి,నార్సింగి, మహేంద్రహిల్స్(బాలికల కళాశాల)లతోపాటు, గౌలిదొడ్డి, చిలుకూరు,షేక్‌పేట (బాలుర కళాశాలలు), కరీంనగర్ అల్గునూరు (కో-ఎడ్యుకేషన్)తో కలిపి మొత్తం ఏడు సీవోఈలను ప్రీమియర్ కళాశాలలుగా పరిగణిస్తారు. కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌లో రాష్ట్రస్థాయిలో మెరిట్ సాధించిన వారికే ఈ కళాశాలల్లో ప్రవేశాలు కల్పిస్తారు. మిగిలిన వన్నీ నాన్ ప్రీమియర్ సీవోఈలు. ఈ కళాశాలల్లో మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తారు.

అర్హతలు

ప్రస్తుతం పదో తరగతి (టెన్త్ క్లాస్) పరీక్షలకు సన్నద్ధం అవుతున్న విద్యార్థులు కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే మొదటిసారే పదో తరగతి పాస్ అవ్వాలి. 2024 ఆగస్టు 31 నాటికి 17 సంవత్సరాలు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, కన్వర్టెడ్ క్రిస్టియన్లకు రెండేళ్లు మినహాయింపు ఉంటుంది. కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంత అభ్యర్థులకు రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంత అభ్యర్థులకు రూ.2 లక్షలు మించకుండా ఉండాలి.

బెల్లంపల్లి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ

పరీక్ష విధానం ఇలా..

ఇందుకు సంబంధించిన పరీక్ష ఫస్ట్ లెవల్, సెకండ్ లెవల్ విధానంలో నిర్వహిస్తారు. ప్రశ్నా పత్రాలు ఇంగ్లిష్, తెలుగు మాధ్యమాల్లో ఇస్తారు. ఒక్కో టెస్ట్ సమయం మూడు గంటలు ఉంటుంది. 8వ తరగతి నుంచి పదో తరగతి వరకు నిర్దేశించిన సిలబస్ ఆధారంగా ప్రశ్నలు అడుగుతారు. ఫస్ట్ లెవల్ పరీక్ష ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటుంది. మొత్తం 160 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలుంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒక్కో మార్కు చొప్పున 160 మార్కులు కేటాయిస్తారు.

ఎంపీసీ పరీక్ష పేపర్‌లో..

ఇంగ్లిష్ నుంచి 20, మ్యాథమెటిక్స్ నుంచి 20, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయోసైన్స్ నుంచి ఒక్కోదానిలో 40 ప్రశ్నలు ఉంటాయి.

ఎంఈసీ, సీఈసీ పరీక్ష పేపర్‌లో..

ఇంగ్లిష్ నుంచి 20, మ్యాథమెటిక్స్ నుంచి 40, సోషల్ నుంచి 70, జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ నుంచి 30 ప్రశ్నలు ఇస్తారు. సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద మాత్రమే గుర్తించాలి. తప్పుగా గుర్తించిన సమాధానాలకు పావుమార్కు చొప్పున నెగెటివ్ మార్కులు ఉంటాయి. ఇక ఎంఈసీ, సీఈసీ అభ్యర్థులకు ఫస్ట్ లెవల్ టెస్ట్‌లో సాధించిన మెరిట్ ఆధారంగా అడ్మిషన్ (ప్రవేశం) కల్పిస్తారు. ఎంపీసీ, బైపీసీ అభ్యర్థులు మాత్రం సెకండ్ లెవల్ స్క్రీన్‌టెస్ట్ రాయాల్సి ఉంటుంది. ఫస్ట్ లెవల్ టెస్ట్‌లో సాధించిన మార్కుల ఆధారంగా ఒక్క సీటుకు ఐదుగురు చొప్పున (1:5) ఎంపిక చేసి సెకండ్ లెవల్ టెస్ట్‌కు అనుమతిస్తారు. ఈ పరీక్ష డిస్క్రిప్టివ్ తరహాలో ఉంటుంది. మ్యాథ్స్, బయోసైన్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీల నుంచి ఒక్కోదానిలో 45 మార్కులతోపాటు ఇంగ్లిష్ నుంచి 15 మార్కులు కలిపి మొత్తం 150 మార్కులు ఉంటాయి.

ఫీజు వివరాలు

కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌కు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు రూ.200 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునేందుకు 2024 జనవరి 15వ తేదీ వరకు చివరి అవకాశం కల్పించారు. హాల్‌టికెట్లను జనవరి 25 నుంచి ఫిబ్రవరి 3 వరకు డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 4న కామన్ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహిస్తారు. ఇతర వివరాల కోసం tsswreiajc.cgg.gov.in ,www.tswreis.ac.in వెబ్‌సైట్‌లలో అభ్యర్థులు సంప్రదించవచ్చు.

పేద విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ గ్రామీణ పేద విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు కల్పిస్తున్నది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 38 కళాశాలల్లో 3,680 సీట్లకు దరఖాస్తులు తీసుకుంటుంది. సీవోఈల్లో అందుతున్న నాణ్యమైన విద్యను సక్రమంగా వినియోగించుకుంటే బంగారు భవిష్యత్‌కు పునాదులు వేసుకున్నట్లే. కళాశాలల్లో చేరాలనుకునే పేద విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలి. ప్రీవియస్ ప్రశ్నాపత్రాలు, ఇతర వివరాల కోసం దగ్గరలోని సీవోఈల ప్రిన్సిపాళ్లను సంప్రదించవచ్చు.

- కొప్పుల స్వరూపారాణి, రీజనల్ కోఆర్డినేటర్

పూజలు చేస్తున్న రైతు కుటుంబ సభ్యులు

'బసవన్న'కు అంతిమ సంస్కారం

బజార్‌హత్నూర్, జనవరి 8 : ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండల కేంద్రానికి చెందిన చట్ల వినల్ ఎద్దు సోమవారం మృతి చెందింది. 25 ఏండ్లుగా తనతో అనుబంధం ఉండడంతో అంతిమ సంస్కారాలు నిర్వహించాడు. అరటి ఆకులతో బండిని ముస్తాబు చేసి, అందులో మృతి చెందిన ఎద్దుకు కుటుంబ సభ్యులు పూజలు చేశారు. అనంతరం బాజాభజంత్రీల మధ్య గ్రామంలోని ప్రధాన వీధుల గుండా తీసుకెళ్లారు. అనంతరం తమ పంట పొలంలో పూడ్చిపెట్టారు.

మామడలో ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న నిర్మల్ జడ్పీ సీఈవో సుధీర్‌కుమార్

తప్పులు లేకుండా నమోదు చేయాలి..

నిర్మల్ జడ్పీ సీఈవో సుధీర్‌కుమార్

మామడ, జనవరి 8 : ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తుల వివరాలను తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని నిర్మల్ జడ్పీ సీఈవో సుధీర్‌కుమార్ వెల్లడించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా దరఖాస్తులను కుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలని ఆపరేటర్లకు సూచించారు. సందేహాలు ఉంటే అధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. పొరపాట్లు లేకుండా ఎంట్రీ చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి శ్రీకళ, ఎంపీడీవో రమేశ్, ఎంపీవో గోవర్ధన్ పాల్గొన్నారు.

కంప్యూటరీకరించండి..

- తప్పులు లేకుండా ఆన్‌లైన్ చేయాలి..
- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతికుమారి
- పాల్గొన్న జిల్లా కలెక్టర్, అధికారులు

ఆదిలాబాద్ రూరల్, జనవరి 8 : ప్రజాపాలనలో భాగంగా ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తుల్లోని వివరాలను పొరపాట్లు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్(వీసీ) నిర్వహించగా.. అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాలు, నూతన రేషన్ కార్డులు, పెన్షన్‌ల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ హాల్ ద్వారా కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ.. ఈనెల 17వ తేదీలోగా నమోదు ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు ఖుష్బు గుప్త, శ్యామలాదేవి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి కిరణ్‌కుమార్, జిల్లా మేనేజర్ సుధారాణి పాల్గొన్నారు.

CS-Telangana
Peddapalli-TS